రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## ప్రభుత్వ భూమిలో కట్టడాలను అరికట్టాలని విజ్ఞప్తి

**ఘట్‌కేసర్, జూన్ 18, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వభూమిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బంటు వెంకటేశ్ కోరారు. మంగళవారం నాడు విలేకరులతో ఆయన మాట్లాడుతూ చౌదరిగూడ సర్వేనంబర్ 869 లోని ప్రభుత్వభూమిలో కొందరు అక్రమార్కులు ఏలాంటి ఆధారాలు లేకుండా కట్టడాలు చేస్తున్నారని తెలిపారు. సర్కారు భూమిలో ఏలాంటి నిర్మాణాలు చేయకూడదని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికి కొందరు నాయకుల ప్రోద్భలంతో అక్రమ కట్టడాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సర్కార్ భూమిలో అక్రమ కట్టడాలపై గతంలో జిల్లా కలెక్టర్‌కు, తహశీల్దార్‌లకు ఫిర్యాదు చేసినా నిర్మాణాలు ఆగడం లేదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వభూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఇకనైనా అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడి ఇక్కడ కట్టడాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వెంకటేశ్ కోరారు.

## మూడున్నర కేజీల గంజాయి పట్టివేత

### -ఇద్దరు వ్యక్తుల అరెస్ట్, రెండుసెల్‌ఫోన్లు స్వాధీనం



దేవరయాంజాల్ పరిధిలో మూడున్నర కిలోల ఎండు గంజాయిని పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన మేడ్చల్ ఎక్సైజ్ అధికారుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 18, ప్రభాతవార్త**
దేవరయాంజాల్ గ్రామ పరిధిలో ఒరిస్సాకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయి (ఎండిన) మూడున్నర కిలోలను మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామ పరిధిలో గంజాయిని ఎక్సైజ్ అధికారులు,సిబ్బంది నిఘా పెట్టి పట్టుకున్నారు. మేడ్చల్ ఎక్సైజ్ సిఐ ఎం నవనీత కథనం ప్రకారం ఒడిస్సాకు చెందిన శంకర్ బాగ్ (28), సిబా కిల (24)లు దేవరయాంజాల్‌లో, మేడ్చల్‌లోని ఇంజనీరింగ్ కళాశాలల వద్ద గంజాయిని అమ్మకాలు జరపటానికి తెచ్చిన గంజాయిని డిప్యూటీ కమిషనర్ దశరథ ఆదేశాల మేరకు డిపిఇఒ ఫయూజిద్దీన్, మేడ్చల్ ఎఇఎస్ మాదవయ్య వారి ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టి పట్టుకోవటం జరిగిందన్నారు. అయితే గంజాయిని అక్రమంగ సరఫరా చేస్తున్నట్లు, అమ్మకాలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దేవరయాంజాల్‌లో నిఘా పెట్టి ఆ ఇద్దరి నుంచి మూడున్నర కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సిఐ నవనీత పేర్కొన్నారు. వారి నుంచి ఎండు గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు కూడ స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరు గంజాయిని దేవరయాంజాల్‌లో, మేడ్చల్ ఇంజనీరింగ్ కళాశాలల వద్ద అమ్మకాలు జరపటానికి వారు తెచ్చినట్లు దీంతో వారు ఎక్సైజ్ అధికారులకు పట్టుబడినట్లు తెలిపారు. గంజాయి సేవించినా, అమ్మకాలు జరిపిన చట్టరీత్య నేరమని, అందుకు కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిస్తే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. సమాచారం అందజేయాల్సిన సెల్‌ఫోన్ నెంబర్లు 8712658740, 9182819684, 7093755115కు తెలియజేయాలని ఆమె వివరించారు.

# మండలంలో జోరుగా నిషేధిత గడ్డి మందుల విక్రయాలు ?

### -కర్ణాటక నుంచి సరఫరా అవుతున్నట్లు వినికిడి
### -సరిహద్దులపై నిఘా పెంచాలంటున్న ప్రజలు

**బంట్వారం, జూన్ 18 (ప్రభాతవార్త):**
బంట్వారం మండలం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దుగా ఉండడంతో పలు రకాల అక్రమాలకు దందాలకు రాచమార్గంగా మారింది. ప్రధానంగా మండలంలోని బొపునారం, తొరుమామిడి, బంట్వారం శివారు సరిహద్దులు కావడంతో అక్రమ దందాలు జోరుగా సాగుతోంది. ఈ మండలంలో దాదాపు 15 నుంచి 20 వరకు ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల డీలర్లు చాలా మంది లాభాలు దృష్టిలో ఉంచుకుని ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తున్నారు. వివిధ రకాల విత్తనాలను సైతం విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బండలంలో పత్తి విత్తనాలను విత్తె సమయం కావడంతో పత్తి విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో పాటు పురుగుల మందులు, గడ్డి మందులు కూడా విక్రయిస్తున్నారు. విత్తనాలు విక్రయించినా రశీదులు మాత్రం ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. సరైన రసీదులు ఇవ్వకుండ, తెల్లకాగితంపై వ్రాసిన రసీదుల ు ఇస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల భయం నెలకొంది. గత కొన్ని రోజుల క్రితమే జిల్లాలో కర్ణాటక నుండి సరఫర అవుతున్న వాటిని అధికారులు పట్టుకున్నా విషయం తెలిసిందే. మండలంలోని రైతులు ఏవి నకిలీవి, లేదా నాణ్యమైన విత్తనాల ు గుర్తించలేక పోతున్నామని పేర్కొంటున్నారు. దీనిపై రైతులకు సరైన అవగాహన లేదని వాపోతున్నారు. అయితే అధికారులు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి అవగాహన కల్పించలేక పోయారని వాపోతున్నారు. నకిలీ విత్తనాల బెడద ఓ వైపు ఉండగా మరోవైపు నిషేదత గడ్డి మందు విక్రయాలు మరోవైపు. పంట పొలాల్లో గ్లైసీల్ వంటి కలుపు మందుల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించింది. అయిన మండలంలో రైతులు గ్లైసీల్ విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇందుకు ప్రధానంగా మండలంలో పలువురు ఎరువులు, విత్తనాల డీలర్లు పురుగు మందుల దుకాణదారులు గుట్టు చప్పుడు కాకుండా గ్లైసీల్ ను విక్రయిస్తున్నారని రైతులు చెబుతున్నారు. కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి గ్లైసీల్ తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారంటున్నారు. బీదర్, చించోలి, హుమ్నాబాద్ తదితర ప్రాంతాల నుంచి అక్రమ మార్గాల్లో తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. కర్నాటకలో రూ.600కు కొనుగోలు చేసి, ఇక్కడ రూ.1000, రూ.1500లకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత రెండు యేండ్లుగా మండలంలో ఇదే పరిస్థితి కొనసాగుతుండగా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో రైతులు, వ్యాపారులు గ్లైసీల్ తీసుకువస్తుండగా పోలీసులు పట్టుకుని వదిలేసారని పుకార్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇదే తంతు కొనసాగుతున్నా సంబందిత వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు పకడ్బంది చర్యలు చేపట్టాల్సి న అవసరం ఎంతైనా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

## స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :**
స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్లో ( హకింపేట,కరీంనగర్,అదిలాబాద్) 4వ తరగతి ప్రవేశాల కొరకు మండల ,జిల్లా ,రాష్ట్ర స్థాయిలో బాలబాలికలకు ఎంపికలు నిర్వహించబడుతున్నాయి.మండల స్థాయిలో 21వ తేది నుండి 25 తేదిలలో మండల స్థాయిలో విద్యాధికారి ఆధ్వర్యంలో వ్యాయామ అధ్యాపకులు ద్వారా నిర్వహింపడతాయని జిల్లా యువజన క్రీడాల అధికారులు తెలిపారు.మండల స్థాయిలో ఎంపిక అయిన వారికి జిల్లా స్థాయిలో వచ్చే నెల 3న బాలబాలికలకు,బ్లాక్ గ్రౌండ్ వికారాబాద్‌లో ఎంపికలు నిర్వహించబడతాయని తెలిపారు.ఉదయం 8 గంటలలోపు రిపోర్ట్ చేయవలసిందిగా కోరారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి వచ్చే నెల 11,12 నాడు స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట నందు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించబడుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి బోనాఫైడ్ సర్టిఫికెట్ ,జనన ధ్రువ పత్రం (మున్సిపల్ లేదా పంచాయతీ) కుల ధ్రువీకరణ పత్రం ,ఆధార్ కార్డు సమర్పించవలెను మరియు మూడవ తరగతి,ప్రొగ్రెస్ రిపోర్ట్,పాస్‌పోర్టు సైజ్ ఫొటోగ్రాఫ్‌లతో హాజరుకావాల్సిందిగా కోరారు.1-9-2015 నుండి 31-8 -2016 లో జన్మించి ఉండాలని వెల్లడించారు.

## రాష్ట్రంలో మద్యానికి మంత్రి ..విద్యకు మంత్రి లేడు

### - జడ్పీటిసి దశరథ్ నాయక్ ఘాటు విమర్శ



విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ చేస్తున్న జడ్పీటిసి

**కడ్తాల్, జూన్ 18 ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్రంలో మద్యానికి మంత్రిత్వ శాఖను కేటాయించారు గాని విద్యాశాఖకు మంత్రిని పెట్టలేని దౌర్భాగ్య పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నడుస్తుందని గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటి జిల్లా సభ్యులు, కడ్తాల్ జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం కడ్తాల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన స్థానిక నాయకులతో కలిసి సుడిగాలి పర్యటన నిర్వహించారు. మైసిగండి ఆశ్రమ పాఠశాలలో నోట్ బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను సూచించారు. అనంతరం కడ్తాల్ మండల కేంద్రంలోని బాయ్స్ హాస్టల్‌లో మధ్యాహ్న బోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణల మొక్కలు నాటారు. తదుపరి కస్తూర్బా పాఠశాలలో నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్, రైతు కో ఆర్డినేటర్ జోగు వీరయ్య, మాజీ సర్పంచ్‌లు గూడూరు లక్ష్మి నరసింహారెడ్డి, తులసిరామ్ నాయక్, హరిచంద్‌నాయక్, లోకేష్, సులోచన సాయిలు, శ్వేతా భూనాథ్, భాగ్యమ్మ జంగయ్య, డైరెక్టర్ వెంకటయ్య, ప్రిన్సిపాల్ బాలరాజు, అనిత ఉపాధ్యాయులు మాజీ ఉపసర్పంచ్‌లు శ్రీను, శారద, పాండు, మాజీవార్డు సభ్యులు శ్రీను కోటియా శ్రీను నాయకులకు కిషన్ పాండు,శ్రీకాంత్,రాజా, జైపాల్,శ్రీను నాయకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -చేవెళ్ల తాజా మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగిరెడ్డి

**చేవెళ్ల, జూన్ 18 ప్రభాతవార్త :** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చేవెళ్ల తాజా మాజీ సర్పంచ్ బండారు శైలజా ఆగిరెడ్డి అన్నారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందువల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో ఇళ్ల ముందు వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలని తెలిపారు. వర్షపు నీరు నీరు నిలువ వల్ల దోమలు స్వైరవిహారం చేస్తాయని , దోమలు ద్వారా మలేరియా, టైపాయిడ్, డెంగ్యూ, బోదకాలు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జ్వరంలాంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు.

**విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి**

పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో పిల్లలు స్కూల్ బస్సు ఎక్కేటప్పుడు తల్లిదండ్రులు దగ్గర ఉండి బస్సు ఎక్కించాలన్నారు. హాస్టల్లో ఉండే విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు ఉండాలని, అధికారులు హాస్టల్లో తనిఖీలు చేయాలన్నారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం



శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 18, ప్రభాతవార్త**
శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆ తరువాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తూంకుంటకు చెందిన నరేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరేణుకా అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి దర్శించుకుని ఆ తరువాత అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డబిల్‌పూర్‌లో విగ్రహాల ధ్వంసం

### -గ్రామస్తుల నిరసన
### -గ్రామంలో పోలీసలు పహరా, బందోబస్తు
### -ఘనసా స్థలం సమీక్షించిన అదనపు డిసిపి నర్సింహారెడ్డి



డబిల్‌పూర్‌లోని ఆలయంలో ద్వంసమైన శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వారి విగ్రహాలు

**మేడ్చల్, జూన్ 18, ప్రభాతవార్త :**
శ్రీ సీతా రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహల ద్వంసం చేసిన సంఘటనతో డబిల్‌పూర్ గ్రామంలో తీవ్ర ఆందోళన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామ శివారులో గల వీరాంజనేయ స్వామి గుట్టపై ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడు శ్రీరామ నవమి రోజు శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టర్ ఆప్ ప్యారిస్‌తో తయారు చేసిన శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను కళ్యాణంలో ఉపయోగించి, అనంతరం అక్కడే ఉన్న ఆలయంలోపల ఉంచారు. ఈ గుట్ట ఆలయానికి వారం వారం భక్తులు వెళ్లి పూజలు చేసి వస్తుంటారు. అదే క్రమంలో మంగళవారం గ్రామానికి చెందిన భక్తుడు ఆలయానికి వెళ్లగా ఆలయంలోపల ఉన్న ఈ ఉత్సవ విగ్రహాలు ద్వంసమై కనిపించాయి. వెంటనే గ్రామ పెద్దలకు విషయాన్ని తెలియజేయగా కొంతమంది అక్కడకు వెళ్లి చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం గ్రామంలో దావనంలా పాకడంతో ప్రజలు, యువకులు గుట్ట వద్దకు చేరుకుని ఆందోళన చెంది నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పర్యవేక్షించారు.



ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

**నిరసన చేపట్టిన యువత**

సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వారి విగ్రహాలు ద్వంసమైన విషయంతో యువత ఆలయం ముందు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ద్వంసం చేసిన నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతలోనె మేడ్చల్ అడిషనల్ డిసిపి నర్సింహారెడ్డి, ఏసిపి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఓటీ అడిషనల్ డిసిపి శోభన్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోకుండా ఉండేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగుకుండా ముందస్తు చర్యగా బెటాలియన్ ఫోర్స్ ను రప్పించి గ్రామంలో, ఆలయం వద్ద బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటన ఎప్పుడు చోటు చేసుకుందో, ఎలా జరిగిందో తెలుసుకోవడానికి క్లూస్ టీం, డాగ్ స్కాడ్‌ను రప్పించి ఆనవాలు సేకిరించారు.

**శాంతియుతంగా ఉండాలి......**

ఆలయం వద్ద నిరసన చేపట్టిన యువకులను ఆడిషనల్ డిసిపి, మేడ్చల్ సీఐ సత్యనారాయణ సముదాయించారు. తమ వంతు విచారణ పూర్తి స్థాయిలో విచారిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను విచారిస్తున్నామని, నాలుగు టీంలను ఏర్పాటు చేసిన గాలింపు చేపడుతున్నామని పేర్కొన్నారు. దుండగులను గుర్తించే వరకు తమకు సహకిరంచాలని కోరుతూ వారిని శాంతింపజేసి అక్కడి నుండి పింపించి వేశారు. తుండగులను గుర్తించి శిక్ష వేయాలని గ్రామస్తులు కోరారు.రాత్రి వరకు పోలీసులు బందోబస్తు కొనసాగిస్తూనే విచారణ చేపట్టారు.



ఆలయం వద్ద నిరసనను విరమించాలని యువకులను సముదాయిస్తున్న ఆడిషనల్ డిసిపి నర్సింహారెడ్డి,


## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి



ఎంపీ మల్లురవిని సన్మానిస్తున్న గుర్రం కేశవులు

**ఆమనగల్లు, జూన్18,ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమిని ఆదరించారని, ఇదే స్ఫూర్తితో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పార్టీ బలోపే తానికి కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల నాటికి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ స్కీం పథకాలను అర్హులకు చేర్చి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆయన తెలిపారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు గుర్రం కేశవులు మంగళవారం ఎంపీ మల్లు రవిని కలుసుకున్నారు. పార్లమెంట్ నాగర్‌కర్నూల్ స్థానంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించు కోవడం అభినందనీయమని కొనియాడారు. ఈసందర్భంగా గుర్రం కేశవులు ఎంపీ మల్లు రవిని శాలువా, బోకేతో సత్కరించారు. కార్యక్రమంలో బికుమాండ్ల రమేశ్ తదితరులు ఉన్నారు.

## రైతులకు వరి,మొక్కజొన్న పంటలపై అవగాహన



పూడూరు మండలం కేంద్రంలోని రైతువేదికలోనిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తదితరులు

**పూడూరు, జూన్ 18, ప్రభాతవార్త :**
వ్యవసాయ రంగంలో రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై మంగళ వారం రాష్ట్ర వ్యవసాయశాఖ అద్వర్యంలో రైతునేస్తం (వీడియో కాన్ఫరెన్స్)ను పూడూరు మండల రైతువేదికలో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రస్తుత వ్యవసాయ కార్యక్రమాల్లో రైతులు వరి, మొక్కజొన్న పంటలపై తీసుకోవాల్సి న మెలకువలు జాగ్రత్తల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్,పరిగి డివిజన్ అధికారి లక్ష్మీకుమారి, పూడూరు, పరిగి, దోమ,కుల్కచెర్ల,చౌడపూర్ మండలాల వ్యవసాయ అధికారులు, ఆయా మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ నాయకులు భూ కబ్జాలకు పాల్పడితే సహించేది లేదు : ఎంపిపి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:**
అనాది కాలం నుండి రైతుల ఆధీనంలో ఉన్న బర్లదొండ్ల భూములను కాంగ్రెస్ నాయకులు అక్రమించడం హేయమైన చర్యయని ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం, ముత్వెల్లిగూడ గ్రామాల్లో పలువురు అనాది కాలం నుండి తమ ఆధీనంలో ఉన్న బర్లదొడ్ల స్థలాలను కాంగ్రెస్ నాయకులు ఇటీవల కబ్జాకు పాల్పడుతున్నట్లు తెలుసుకున్న బీజేపీ నాయకులు ఎంపీపీ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేయలేదని అక్కసుతో బర్లదొడ్ల స్థలాలను కాంగ్రెస్ నాయకులు అధికారం అడ్డంపెట్టుకుని అధికారులతో పాటు పోలీసుల అండపెట్టుకుని అక్రమణకు పాల్పడుతున్నారని అన్నారు. పేద వర్గాల జోలికి వస్తే సహించబోమని కాంగ్రెస్ నాయకులను ఎంపీపీ హెచ్చరించారు. వంద సంవత్సరాలకు పైగా రైతులు వినియోగిస్తున్న బర్లదొండ్ల స్థలాలపై మీ పెత్తనం ఏంటని ప్రశ్నించారు. అన్యాయంగా బర్లదొండ్ల స్థలాల విషయానికి వస్తే సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొంతం వెంకట్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బస్వరాజ్ గౌడ్, భూ బాధితులు పాల్గొన్నారు.



కాచవాని సింగారంలో అక్రమణకు గురైన బర్లదొడ్ల స్థలాలను పరిశీలించి బాధితులతో మాట్లాడుతున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**షాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :**
విద్యార్థుల అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటు చేసి, పాఠశాలలను బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధి లోని హైతాబాద్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులకకు నోటు పుస్తకా లను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్ల శ్రీనివాసచారి మంగళ వారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల్లో మౌలిక వసతులు ఉన్నప్పుడే విద్యలో పిల్లలు రాణించగలరని అన్నారు. ఈకార్యక్రమంలో హైతాబాద్ మాజీ సర్పంచ్ ఖాజామియాపటేల్, గ్రామ కమిటీ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గడ్డ వెంకట్‌రెడ్డి, కుమ్మరి బాల య్య, కావలి రవి, ప్రశాంత్, నరసింహ, కృష్ణ, యాదయ్య, శ్రీని వాస్, రాముగౌడ్, నరసింహారెడ్డి, దయానంద్ గౌడ్, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

## రామస్వామిపై విచారణ



వెలుగు కార్యాలయంలో వివరాలు అడిగి తెలుసు కుంటున్న ఏపిడి సూర్యరావు

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 18,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల ఏపిఎంగా విధులు విర్వహిస్తున్న రామస్వామిపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించారు. మంగళవారం డిఆర్‌డిఎ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఏపీడి సూర్యరావు విచారణ జరిపారు. ఏపిఎంపై ఆరోపనలు చేసిన విఓఎలతో ఆయన మాట్లాడారు. ఏపిఎం వారిపై ప్రవర్తించిన తీరును అడిగి తెలుసు కున్నారు. తమపై దురుసుగ ప్రవర్తిస్తున్నాడని వీఓఎలు మౌనిక, నశ్రీన్‌బేగంలు లిఖిత పూర్వకంగ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మరి కొంత మంది కూడ తమపై దురుసుగ ప్రర్తించినట్లు తెలిపి నట్లు ఆయన తెలిపారు. వారు కూడ లిఖిత పూర్వకండ ఇవ్వాలని కోరగ వారు వ్రాసి ఇవ్వాడానికి నిరాకరించినట్లు తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేకలందించనున్నట్లు ఆయన వివరించారు.

## ఆలయాలపై దాడులు, విగ్రహల ధ్వంసం హేయమైన చర్య

### -మేడ్చల్ మండల బిజెపి అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

**మేడ్చల్, జూన్ 18. ప్రభాతవార్త :** హిందూ దేవాలయాలపై దాడులు నిర్వహించి, విగ్రహాలను ద్వంసం చేయడం హేయమైన చర్య అని మేడ్చల్ మండల బిజెపి అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆరోపించాడు. మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో మంగళవారం సీతారాముల వారి విగ్రహల ద్వంసం సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలిచే హిందూ ఆలయాలపై ఈ విదమైన దాడులు జరిపి అలజడులకు కొంతమంది దుండగులు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాడు.

